# క్రైమ్ కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 171 గుంటూరు, సోమవారం 02- 03 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



**రిపోర్టర్లు కావలెను**

క్రైమ్ కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.



సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

**98497 07349**



## ముఖ్య గమనిక

మీ వివాహాది శుభకార్యముల కొరకు
మరియు మీ పెళ్లిరోజు, పుట్టినరోజు ప్రకటనల కొరకు
మరియు మీ వ్యాపార ఇతర కార్యముల
ప్రకటనల కొరకు మా పత్రికలో అతి తక్కువ ధరలో
ప్రకటనలు వేయబడును.

ఇతర వివరముల కొరకు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

**98497 07349**


## అమరావతిలో జస్టిస్ సిటీకి

# సహకరిస్తాం



**విజయవాడ, మార్చి 01 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులు 33 వేల ఎకరాలు ఇవ్వడమే మధ్యవర్తిత్వం (ఆర్బిట్రేషన్) విజయానికి ఉదాహరణ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడ వేదికగా జరిగిన ఆర్బిట్రేషన్ సదస్సులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. అమరావతిలో జస్టిస్ సిటీ ఏర్పాటుకు పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. విజయవంతమైన మధ్యవర్తిత్వానికి గౌరవ వేతనం ఇస్తామన్నారు. అమరావతిలో జ్యుడీషియల్ అకాడమీ, ఇంటర్నేషనల్ లా కౌన్సిల్‌కు సహకరిస్తామని పేర్కొన్నారు. అమరావతిలో మధ్యవర్తిత్వ కేంద్రం ఏర్పాటుకు సహకరిస్తామని తెలిపారు. అమరావతిని 'బ్లూ-గ్రీన్' సిటీగా నిర్మాణం చేస్తామని ప్రకటించారు. ఈ రోజు (ఆదివారం) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాజధాని అమరావతిలోనే ఉన్నారన్నారు. ఆయన ఇక్కడ ఉండడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. జస్టిస్ సూర్యకాంత్.. ఈ రోజు తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని ఇక్కడికి వచ్చారని తెలిపారు. రాజధాని కోసం రైతులు ముందుకొచ్చి 33 వేల ఎకరాలు ఇచ్చారని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వివరించారు. రాజధాని అమరావతిని గొప్ప నగరంగా నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. అమరావతిలో నివసించే వారు 20 ఏళ్లు ఎక్కువగా జీవిస్తారన్నారు. 2047 నాటికి భారత్ నెంబర్‌వన్ ఆర్థిక వ్యవస్థగా మారుతుందని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. మన దేశానికి యువత, టెక్నాలజీ పెద్ద బలమని ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు అభివర్ణించారు.





### ఖమేనీ మరణానంతరం మసీదుపై ఎర్రజెండా..

# ఇది దేనికి సంకేతం

**టెహ్రాన్, మార్చి 01 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఇరాన్‌లో మతపరంగా ప్రాధ్యానం కలిగిన ఖుమ్ నగరంలోని జంకరాన్ మసీదు పై ఎరుపు జెండా ఎగురవేశారు. అమెరికా-ఇజ్రాయెల్ సైనిక చర్యలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతిచెందిన వార్త తెలియగానే ఈ మసీదుపై జెండా ఎగురవేసిన్నట్టు పలు కథనాలు వెలువడుతున్నాయి. న్యాయం, ప్రతీకారానికి సంకేతంగా ఈ జెండా ఎగురవేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఖమేని హత్యానంతరం మధ్యప్రాచ్యంలో ఆయన మద్దతుదారుల్లో ప్రతీకార ఆగ్రహం చెలరేగుతోందనడానికి ఇది నిదర్శనంగా చెబుతున్నారు. కర్బలా యుద్ధం.. కర్బలా యుద్ధం తరువాత క్రీ.శ. 680లో ఇలా మసీదుపై జెండా ఎగురవేసినట్టు చరిత్ర చెబుతోంది. ఆ యుద్ధంలో మహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమాన్ హుస్సేన్ హతమయ్యాడని చెబుతారు. షియా సాంప్రదాయ ప్రకారం పగ తీర్చుకున్నాకే జెండా తొలగిస్తారు.

2 లో

# గల్ఫ్ ఉద్రిక్తతలు! భారత్‌కు టెన్షన్ లేనట్టే



**ఇంటర్నెట్ డెస్క్:** గల్ఫ్ ప్రాంతం రణరంగంగా మారడంతో ముడి చమురు, సహజ వాయువు రవాణాపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ముడి చమురు రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసేశామని ఇరాన్ సైన్యం ప్రకటించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ఈ పరిస్థితులతో భారత్‌కు తక్షణం కలిగే ఇబ్బంది ఏమీ లేదని నిపుణులు చెబుతున్నారు. భారత్ వద్ద కనీసం పక్షం రోజులకు సరిపడా ఇంధన వనరులు ఉన్నాయని జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. మీడియా కథనాల ప్రకారం, 10-15 రోజుల పాటు దేశ అవసరాలకు సరిపడా ముడి చమురు నిల్వలు భారత రిఫైనరీల వద్ద ఉన్నాయి. 7-10 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు కూడా ఉన్నాయి. అవసరం అనుకుంటే వ్యూహాత్మక ఇంధన నిల్వలను వాడుకోవచ్చు. వీటితో వారం రోజుల పాటు భారత దేశ అవసరాలను తీర్చుకోవచ్చు. అయితే, జలసంధి మూసివేత ఎక్కువ రోజుల పాటు కొనసాగదని మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. అయినప్పటికీ అత్యవసర సందర్భాల కోసం ప్రణాళికలతో భారత్ సిద్ధంగా ఉంది. దేశంలో వినియోగించే ముడి చమురులో 88 శాతం భారత్ దిగుమతి చేసుకుంటోంది. 50 శాతం సహజ వాయువునూ దిగుమతి చేసుకుంటోంది. చమురు దిగుమతుల్లో 50 శాతం హోర్ముజ్ జలసంధి మీదుగానే భారత్‌కు చేరతాయి. ఇక ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో 60 శాతం కూడా ఇదే మార్గంలో దిగుమతి చేసుకుంటుంది. ఎల్పీజీ దిగుమతులూ దాదాపు పూర్తిగా ఇదే మార్గం మీదుగా భారత్‌కు చేరుకుంటాయి. ఇక ఘర్షణలు ఎక్కువ రోజుల పాటు కొనసాగితే ప్రత్యామ్నాయాలపై భారత్ దృష్టిపెట్టే అవకాశం ఉంది. రష్యా, వెనెజువెలా, బ్రెజిల్, ఆఫ్రికా దేశాల నుంచి దిగుమతులను పెంచే అవకాశం ఉంది. అయితే, ఇతర దేశాల నుంచి దిగుమతులకు దూరాభారం కారణంగా ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి దిగుమతులు భారత్‌కు చేరేందుకు ఐదు రోజులు పడితే రష్యా నుంచి వచ్చేందుకు దాదాపు నెల రోజుల వరకూ పట్టొచ్చు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో చమురు రవాణాకు తాత్కాలిక ఆటంకాలు ఏర్పడే అవకాశాలు ఉన్నా దీర్ఘకాలిక అవాంతరాలకు ఛాన్స్ తక్కువేనన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

### ఇజ్రాయెల్ నగరంపై ఇరాన్ క్షిపణి దాడి..

# 9 మంది మృతి, 28 మందికి గాయాలు



**జెరూసలేం: మార్చి 01 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య రెండోరోజైన ఆదివారంనాడు కూడా దాడులు, ప్రతిదాడులు చోటుచేసుకున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేని మృతి చెందడంతో ఇరాన్ ప్రతీకారదాడులు కొనసాగిస్తోంది. ఆదివారంనాడు ఇరాన్ క్షిపణి ఒకటి ఇజ్రాయెల్ నగరమైన బీట్ షెమేష్‌ను తాకడంతో తొమ్మిది మంది మృతి చెందారు. మరో 28 మంది వరకూ గాయపడినట్టు ఎమర్జెనీ సర్వీస్ వర్గాలు తెలిపాయి. ఇరాన్ క్షిపణి నేరుగా ఒక భవంతిని ఢీకొట్టడంతో పెద్దఎత్తున ఇజ్రాయెల్ రెస్క్యూ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షిపణి దాడికి భవంతి కుప్పకూలడంతో శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీస్తున్నారు. శిథిలాల కింద ఇంకా ఎక్కవమందే ఉన్నారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సహాయక సిబ్బంది చెబుతున్నారు. మరోసారి విరుచుకుపడిన ఇజ్రాయెల్ కాగా, ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి ఆదివారంనాడు విరుచుకుపడింది. భారీ పేలుళ్లతో పెద్దఎత్తున పొగలతో భీతావహ పరిస్థితులు కనిపించాయి. సెంట్రల్ టెహ్రాన్ లక్ష్యంగా తాము దాడులు జరుపుతున్నట్టు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. పేలుడు జరిగిన ప్రాంతానికి సమీపంలో పోలీస్ హెడ్‌క్వార్టర్స్, అధికారిక టెలివిజన్ కార్యాలయం ఉన్నాయి.

## మిత్రులకు నమస్కారం,

సత్తెనపల్లి పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో పరివర్తన స్కూల్ ఎదురుగా ఉన్న క్రైమ్ కౌంటర్ దినపత్రిక రాష్ట్ర కార్యాలయం వద్ద క్రైమ్ కౌంటర్ దినపత్రిక యాజమాన్యం చేతచలివేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుంది. చలివేంద్రాన్ని మన MEF ఆధ్వర్యంలో 3/3/2026 మంగళవారం రోజున ఉదయం 9 గంటలకు MEF నాయకుల చేత ప్రారంభోత్సవం చేయబడుతుంది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా MEF పల్నాడు జిల్లా నాయకులు, సత్తెనపల్లి నాయకులు హాజరవుతున్నారు.

కావున ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయవలసినదిగా ఆహ్వానిస్తున్నాం.

ఇట్లు

శ్రీ కటికల వరప్రసాద్, స్టాఫ్,ఊమిత్ర బృందం...

సి. ఈ. ఓ.&ఎడిటర్

క్రైమ్ కౌంటర్ దినపత్రిక,

సత్తెనపల్లి.ఆంధ్రప్రదేశ్

# ఖమేనీ మరణాంతరం మసీదుపై ఎర్రజెండా.. ఇది దేనికి సంకేతం

అమెరికా దాడుల్లో ఖమేనీ హతం

టెహ్రాన్‌పై శనివారం అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన గగనతల దాడుల్లో ఖమేనీ, ఆయన సైన్యంలోని కీలక వ్యక్తులు మృతి చెందారు. ఖమేనీ మృతిని ఇరాన్ అధికారిక మీడియా ధ్రువీకరించింది. ఖమేనీ మృతి వార్తతో భారత్ సహా పలు దేశాల్లో నిరసనలు, నివాళులు చోటుచేసుకున్నాయి. ప్రపంచ చరిత్రలోని అత్యంత దుర్మార్గుల్లో ఖమేనీ ఒకరని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు ఇరాన్ ప్రజలకు ఇంతకంటే మంచి అవకాశం రాదన్నారు. ఖమేనీ చనిపోయారనటానికి చాలా సంకేతాలు ఉన్నాయని, ప్రజలు తమ భవిష్యత్తు కోసం సైన్యంతో కలిసి ఖమేనీ పాలనకు ముగింపు పలకాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. కాగా, ఖమేనీ మరణాంతరం 66 ఏళ్ల షియా సీనియర్ మతాధికారి అయతుల్లా అరాఫీని తాత్కాలిక సుప్రీం నేతగా ఎంపిక చేసినట్టు ఇరాన్ మీడియా తెలిపింది. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేంత వరకూ అరాఫీ తాత్కాలిక నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తారు.

# జన్మదిన వేడుకల్లో పాల్గొన్న శాసనసభ్యులు కన్నా గారు



**సత్తెనపల్లి నియోజకవర్గం** గుంటూరు పట్టణం నందు భాష్యం విద్యాసంస్థల అధినేత శ్రీ భాష్యం రామకృష్ణ గారి జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు. తెలియజేసిన సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు.శ్రీ కన్నా లక్ష్మి నారాయణ గారు

# గల్ఫ్ దేశాల్లో ఉన్న ఏపీ ప్రజలు ఆందోళన పడొద్దు: మంత్రి కొండపల్లి




**అమరావతి: మార్చి 01 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఇరాన్- ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్ర ఎన్.ఆర్.ఐ. సాధికారిత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి కొండపల్లి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆయా దేశాల్లో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు, పర్యాటకులు సహా ఇతర రాష్ట్ర పౌరులు ఎవరూ ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకూ సంయమనం పాటించాలని, త్వరలోనే విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయని మంత్రి తెలిపారు. ఇండియన్ ఎంబసీలో ఆయా దేశాల్లో ఉన్న రాష్ట్ర పౌరులందరూ నమోదు చేసుకోవాలని మంత్రి కొండపల్లి కోరారు. ఇరాన్, ఇజ్రాయెల్ ప్రాంతాల్లో ఉన్న భారతీయుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం, భారత విదేశాంగ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, మీడియా ద్వారా సరైన సమాచారం తెలుసుకుని, ఎప్పటికప్పుడు ఇండియన్ ఎంబసీలకు అందుబాటులో ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. గగనతలంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల కారణంగా విమానాల రవాణా ఆలస్యం అవుతోందని, త్వరలోనే విమానయాన సేవలు పునరుద్ధరిస్తామని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు, ఉద్రిక్త పరిస్థితులు ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండేందుకు ప్రయత్నం చేయాలని రాష్ట్ర పౌరులను మంత్రి కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఇస్తున్న ఆదేశాలు, సూచనల మేరకు ఎప్పటికప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరుపుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

# సత్తెనపల్లి టౌన్ పోలీస్ వారి ఆధ్వర్యంలో మహిళామణుల ర్యాలీ



ఈ రోజు ది.01.03.2026 వ తేదీ ఉదయం 11:00 గాంవీ గంటలకు.... "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" సెలబ్రేషన్స్ లో భాగంగా సత్తెనపల్లె టౌన్ జ× నరహరి నాగమల్లేశ్వరావు గారి ఆధ్వర్యంలో మహిళామణులు తో సత్తెనపల్లి టౌన్ పొలిసు స్టేషన్ వద్ద నుండి తాలూకా సెంటర్, గడియార స్తంభం, ఐదు లాంతర్ల సెంటర్ వరకు ర్యాలి నిర్వహించటం జరిగింది. ఈ ర్యాలీ లో సుమారు 300 మంది అనగా మహిళలు, మహిళా పోలీస్ వారు విద్యార్దినులు, అంగన్వాడి ఆషా వర్కర్ లు మొదలైన వారు పాల్గొనారు. మహిళా సాధికారత మరియు భద్రత పై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించటం జరిగింది. సత్తెనపల్లి టౌన్ పోలీస్ వారి ఆధ్వర్యంలో "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" సందర్భంగా లి సెలబ్రేషన్స్ లో భాగంగా మహిళలకు ఇండోర్ గేమ్స్ ప్రోగ్రాం :-

సత్తెనపల్లి టౌన్ లోని కాకతీయ కళ్యాణ మండపం లో... సత్తెనపల్లి టౌన్ జ× నరహరి.నాగమల్లేశ్వరావు గారి ఆధ్వర్యంలో మహిళామణుల కి ఇండోర్ గేమ్స్ నిర్వహించినారూ...



ముఖ్య అతిథులుగా :-

1)సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి గౌరవ డాక్టర్.సుజాత

2)జణూరా (చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్) శ్రీలత

3) కృష్ణవేణి జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ శ్రీనివాసరావు దృపతులు

4)రాజ గార్ల్స్ హాస్టల్ వార్డెన్ (నాగన్నకుంట) సుమని

సత్తనపల్లి పట్టణ ఎస్సైలు ఎం పవన్ కుమార్ మరియు రాజశేఖర్ గారు సిబంది పాల్గొన్నారు.

సుమారు 250 మంది మహిళా మణులు అనగా విద్యార్థినులు, అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ వారు, అంగన్వాడీలు, ఆషా వర్కర్లు మొదలైన మహిళలు పాల్గొన్నారు.

మహిళల ఇండోర్ క్రీడలో భాగంగా చెస్, క్యారమ్స్, హ్యాండ్ రింగ్ వంటి క్రీడలు నిర్వహించారు

# ఐటీఐ కళాశాలను ప్రారంభించాలని రాస్తారోకో

## డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలు ధర్నా

**క్రైం కౌంటర్: నరసరావుపేట రూరల్** – నరసరావుపేట రూరల్ పరిధిలోని ములకలూరు గ్రామంలో నరసరావుపేట నుండి సత్తెనపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఆదివారం ముస్లిం మైనార్టీలవారు రాస్తారోకో నిర్వహించారు. గ్రామంలో ముస్లిం మైనార్టీల కోసం నిర్మించిన ఐటిఐ కళాశాలను కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన ప్రభుత్వ ప్రతిపాదనను తక్షణం విరమించుకోవాలని, ముస్లిం మైనార్టీల కోసం ఐటిఐ కళాశాలను తక్షణమే ప్రారంభించాలని నినాదలు చేసారు.అదేవిధంగా మైనార్టీల ఆస్తులను సంరక్షించాలని ఐటిఐ భవనం వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ముప్పై నిముషాలు ధర్నా నిరసన కార్యక్రమం చేపట్టారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసు అధికారులు,సిబ్బంది అక్కడకు చేరుకొని వాహనాలకు అంతరాయం కలగకుండ



ట్రాఫిక్ ను క్లియర్ చేసారు.

# మాచర్ల జడ్పీ బాయ్స్ హై స్కూల్ లో స్వచ్ఛభారత్,శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో.




**క్రైం కౌంటర్ న్యూస్ మాచర్ల.పులిమెల మాణిక్యం.** పల్నాడు జిల్లా,మాచర్ల పట్టణంలోని పిడబ్ల్యుడి కాలనీలోని జడ్పీ బాయ్స్ హై స్కూల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా స్వర్ణాంధ్ర,స్వచ్ఛ ఆంధ్ర ధ్యేయంగా,స్వచ్ఛ గ్రీన్ లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. మాచర్ల పట్టణంలోని జడ్పీ బాయ్స్ హైస్కూల్లో అపరిశుభ్రంగా ఉన్న విషయం గమనించిన శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి జెడ్పీ బాయ్స్ హై స్కూల్ హెడ్మాస్టర్ ఎం. వెంకటేశ్వర్లు యొక్క సూచనలతో హైస్కూల్ పరిసరాలలోని పిచ్చి మొక్కలను,కంప చెట్లను తొలగించి కొమ్మలను కత్తిరించి శుభ్రం చేసి నీటుగా తయారు చేసినట్లు గోవిందరెడ్డి తెలిపారు. ఈరోజు జరిగిన స్వర్ణాంధ్ర,స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జడ్పీ బాయ్స్ హై స్కూల్ విద్యార్థులు మరియు కిడ్స్ పాఠశాల విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొనీ , పిచ్చి చెట్లను కంపచెట్లను శ్రీ రామకృష్ణ సేవాసమితి సభ్యులతో పాటు తొలగించారు.ఈ సందర్భంగా శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి 10 గంటల వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా స్వామి వివేకానంద స్ఫూర్తితో మానవ సేవయే మాధవ సేవ అన్న ఆయన స్ఫూర్తితో, పరిశుభ్రతలోనే పరమార్థుడు ఉన్నాడు అన్న మహాత్మా గాంధీ స్ఫూర్తితో ముఖ్యంగా మన ప్రధానమంత్రి వర్యులు పూజ్యులు, పెద్దలు నరేంద్ర మోడీ గారి యొక్క స్ఫూర్తితో పూజ్యులు,పెద్దలు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు గారీ స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నామని గోవింద రెడ్డి తెలిపారు. ఎక్కడ మాచర్లలో పట్టణంలో అపరిశుభ్రంగా ఉన్న వెంటనే గుర్తించి అక్కడ శుభ్రం చేస్తున్నట్టు గోవిందరెడ్డి తెలిపారు. స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరు స్వర్ణాంధ్ర , స్వచ్ఛంద కార్యక్రమంలో పాల్గొని మహానుభావులు కలలు కన్నా నవభారత నిర్మాణానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవాసమితి సభ్యులైన కండ్లకుంట అంగనవాడి టీచర్ సిహెచ్,రుక్మిణి, జెడ్పి బాయ్స్ హై స్కూల్ టీచర్ గండ్రకోట శివసుందరి వరప్రసాద్,సుందరమ్,మారుతి మరియు విద్యార్థులు రామకృష్ణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా భాష్యం రామకృష్ణ జన్మదిన వేడుకలు పాల్గొన్న ఎమ్మెల్యే




**క్రైం కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు నియోజకవర్గం :** భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ జన్మదిన వేడుకలకు హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపిన పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ . ఈ



కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు షేక్ జానీ మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# బీసీ కమ్యూనిటీ హాల్స్ ను ప్రారంభించిన తెనాలి పెమ్మసాని





క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు తాడికొండ నియోజకవర్గం : దాతలు సూద్నీ గుంట రాఘవేంద్రప్రసాద్ కళ్యాణి సహకారంతో తుళ్లూరు మండలం పెద పరిమి తాడికొండ మండలం రావెల గ్రామాలలో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్స్ ను కేంద్ర సహాయక మంత్రి వర్యులు పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి ప్రారంభించిన తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ అనంతరం దాతలు సూద్నీ గుంట రాఘవేంద్రప్రసాద్ కళ్యాణి కు సన్మానం చేసారు.

# బహ్రెయిన్‌లో ఉద్రిక్త పరిస్థితులు.. తెలుగువారి భద్రతపై అయ్యన్నపాత్రుడు ఆరా

క్రైమ్ కౌంటర్ న్యూస్): అమరావతి, మార్చి 1 బహ్రెయిన్‌లోని అమెరికన్ నావల్ బేస్‌పై ఇరాన్ దాడులు చేస్తున్న తరుణంలో అక్కడ ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. ఏపీకి చెందిన సుమారు 50 వేల మంది వరకు అక్కడ వివిధ ఉద్యోగాలు చేస్తున్నారని పేర్కొన్నారు. బహ్రెయిన్‌లోని ప్రవాస తెలుగువారి యోగక్షేమాలని అయ్యన్నపాత్రుడు అడిగి తెలుసుకున్నారు. గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బహ్రెయిన్‌లో నివసిస్తున్న ప్రవాస తెలుగువారి భద్రతపై ఆరా తీశారు.తెలుగువారి యోగక్షేమాలపై ఆరా..ముఖ్యంగా నర్సీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన వారు అనేకమంది ఉపాధి నిమిత్తం బహ్రెయిన్‌లో స్థిరపడ్డారని అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ విపత్కర పరిస్థితుల మధ్య నాతవరానికి చెందిన ఎన్నారై శెట్టి సతీశ్‌కు ఇవాళ(ఆదివారం) స్వయంగా ఫోన్ చేసి, అక్కడి తెలుగువారి యోగక్షేమాలను అయ్యన్నపాత్రుడు అడిగి తెలుసుకున్నారు. బహ్రెయిన్‌లో ఉన్న తెలుగువారంతా అప్రమత్తంగా ఉండాలని, స్థానిక ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని దిశానిర్దేశం చేశారు.

తక్షణ సహాయక చర్యలు చేపడతాం..

ఎలాంటి ఆపద వచ్చినా ఏపీఎన్ఆర్టీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని అయ్యన్నపాత్రుడు భరోసా ఇచ్చారు. అవసరమైతే అక్కడి తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో మాట్లాడి తక్షణ సహాయక చర్యలు చేపడతామని మాటిచ్చారు. ఈ కష్టకాలంలో తమ బాగోగులు తెలుసుకుని, అండగా నిలుస్తూ తమలో మనోధైర్యాన్ని నింపిన స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి ఎన్నారైలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# నాగ్‌పూర్‌లో భారీ పేలుడు.. 15 మంది మృతి



క్రైమ్ కౌంటర్ న్యూస్): ఇంటర్నెట్ డెస్క్, మార్చి 1మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. నాగ్‌పూర్‌లోని కటోల్ ప్రాంతంలో పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమ ఎస్బీఎల్ ఎనర్జీ లిమిటెడ్‌లో ఈ ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన పరిశ్రమలో డిటోనేటర్లు, కాస్ట్ బూస్టర్లు, భూకంప పేలుడు పదార్థాలు తయారు చేస్తారని తెలుస్తోంది. ఎస్బీఎల్‌లోని ఓ యూనిట్‌లో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ సమయంలో 20 మందికి పైగా ఉద్యోగులు వివిధ యూనిట్లలో పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించడంతో 15 మంది మరణించారు. ఈ ఘటనలో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలను కలిగించింది. స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు,ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మరికొందరి పరిస్థితి విషమం..

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ ప్రమాదంలో 12 మంది కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సుమారు 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. వీరిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పేలుడు ధాటికి ఈ పరిశ్రమ గోడౌన్ పూర్తిగా నేలమట్టమైంది. ఈ ప్రమాదం ధాటికి చుట్టుపక్కల ఉన్న ఇతర భవనాలు కూడా దెబ్బతిన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక యంత్రాలు గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ గోడౌన్‌లో అనుమతించిన పరిమితి కంటే ఎక్కువ మొత్తంలో పేలుడు పదార్థాలను నిల్వ చేయడంతోనే ప్రమాద తీవ్రత పెరిగిందని సమాచారం.

సహాయక ఆపరేషన్..

భవనం శిథిలాల కింద ఎవరైనా చిక్కుకున్నారేమోననే అనుమానంతో రెస్క్యూ టీమ్స్ గాలింపు చర్యలు చేపట్టాయి. పేలుడుకు గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. నిల్వ ఉంచిన పేలుడు పదార్థాల విషయంలో సరైన భద్రతా ప్రమాణాలు పాటించారా..?, గోడౌన్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు అంటుకున్నాయా..? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ ఘటనపై మహారాష్ట్ర ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఘటనతో ఆయా బాణసంచా కేంద్రాల్లో భద్రతా తనిఖీలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు.

# ఇరాన్‌పై దాడులు.. చైనా గగనతల రక్షణ వ్యవస్థ విఫలం!

క్రైమ్ కౌంటర్ న్యూస్): ఇంటర్నెట్ డెస్క్: అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ నగరాల్లో పెద్ద సంఖ్యలో భవనాలు ధ్వంసం కావడంతో రక్షణ రంగ వర్గాల్లో చర్చ మొదలైంది. చైనా నుంచి కొనుగోలు చేసిన గగనతల రక్షణ వ్యవస్థలు విఫలమయ్యాయా? అన్న చర్చ నడుస్తోంది. ఇరాన్‌కు కీలకమైన సమయంలో చైనా క్షిపణి రక్షణ వ్యవస్థ ఆదుకోలేకపోయిందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.గతంలో ఇరాన్ వద్ద రష్యాకు చెందిన ఎస్-300పీఎమ్‌యూ-2 గగనతల రక్షణ వ్యవస్థ ఉండేది. గతేడాది అమెరికా జరిపిన క్షిపణి దాడులను అడ్డుకోవడంలో ఇది పూర్తిగా విఫలం కావడంతో ఇరాన్ చైనావైపు మళ్లింది. చైనా నుంచి హెచ్‌క్యూ-9బీ గగనతల రక్షణ వ్యవస్థను దిగుమతి చేసుకుంది. చమురుకు సరఫరాకు ప్రతిగా ఈ వ్యవస్థను తీసుకుంది.దీర్ఘశ్రేణి లక్ష్యాల కోసం ఈ వ్యవస్థను చైనా నుంచి ఇరాన్ తెచ్చుకుంది. అణుకేంద్రాలు, అణు ఇంధన శుద్ధి కేంద్రాల వద్ద ఈ వ్యవస్థలను మోహరించింది. చైనా ఎయిరోస్పేస్ సైన్స్ అండ్ ఇండస్ట్రీ కార్పొరేషన్ హెచ్‌క్యూ-9బీని అభివృద్ధి చేసింది. అమెరికాకు చెందిన పాట్రియట్ పీఏసీ-2 వ్యవస్థ స్ఫూర్తితో దీన్ని డిజైన్ చేసింది. ఆ తరువాత తనదైన మెరుగులు దిద్దింది. ఈ వ్యవస్థ రేంజ్ 260 కిలోమీటర్లు. గరిష్ఠంగా 50 కిలోమీటర్ల ఎత్తులోని లక్ష్యాలనూ ధ్వంసం చేయగలదు.

ఈ వ్యవస్థను చైనా స్వయంగా వినియోగిస్తోంది. వ్యూహాత్మకంగా కీలకమైన బీజింగ్, టిబెట్, దక్షిణ చైనా సముద్ర ప్రాంతాల్లో వీటిని మోహరించింది. ఇక పాకిస్థాన్ కూడా ఈ గగనతల రక్షణ వ్యవస్థను వినియోగిస్తోంది. అయితే, ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత దళాల దాడులను కూడా ఈ వ్యవస్థ పూర్తిస్థాయిలో అడ్డుకోలేకపోయిందన్న విమర్శ ఉంది. తాజాగా ఇరాన్‌లో కూడా హెచ్‌క్యూ-9బీ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




# మహిళల సాధికారతే లక్ష్యం-

పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ.



క్రైం కౌంటర్: నరసరావుపేట టౌన్ – మహిళా సాధికారతే లక్ష్యంగా పల్నాడు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ను పురస్కరించుకొని జిల్లా లోని పలు పోలీస్ స్టేషన్ల తో పాటు నరసరావుపేట పట్టణంలో స్థానిక ఎస్ ఎస్ ఎన్ కాలేజీ నుండి పల్నాడు బస్టాండ్ వరకు మహిళా పోలీసులు, మహిళ పోలీసు సిబ్బంది పలు కళాశాలల విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. మహిళా సాధికారత, చైతన్యం, ప్రగతి తదితర అంశాలపై జై జైలు పలికారు. ఈసందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ

రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర డిజిపి ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, వేధింపులు, చట్టపరమైన హక్కులు మరియు భద్రతా చర్యలపై ప్రజలకు సమగ్రంగా అవగాహన కల్పించారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలను ధైర్యంగా వెలుగులోకి తీసుకురావాలని, చట్టపరమైన సహాయం పొందేందుకు ముందుకు రావాలని సూచించారు.అలాగే మహిళల భద్రత కోసం ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ వారు అమలు చేస్తున్న చర్యలను వివరించారు. మహిళలు తమ హక్కులను తెలుసుకొని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి స్వయం సాధికారత సాధించాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు.

జిల్లా పోలీస్ శాఖ వారు అందించే పోలీస్ సేవలను జిల్లా మహిళలు అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలు పోలీస్ స్టేషన్ అధికారులు, మహిళా ఎస్సైలు మరియు వివిధ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి’

**అంగన్‌వాడీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ కృషి చేస్తోందని ప్రజాప్రతినిధులు అన్నారు. ఈసందర్భంగా వారు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు.**

**చిరుద్యోగుల సంక్షేమం..**

**ప్రభుత్వంతోనే సాధ్యం: ఎమ్మెల్యే కోండ్రు**



క్రైమ్ కౌంటర్ న్యూస్):రాజాం, మార్చి 1 అంగన్‌వాడీ కార్యకర్తలు, చిరుద్యోగుల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఈసందర్భంగా ఆయన ఆదివారం ఒక ప్రకట న విడుదల చేశారు. గతంలో ఎప్పుడు లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండు సార్లు వేతనాలు పెంచి న ఘనత టీడీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షల నిధులు విడుదల చేసిందని చెప్పారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

అంగన్‌వాడీలకు అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, మార్చి 1 అంగన్‌వాడీ కార్యకర్తలకు అండగా ప్రభుత్వం నిలబడిం దని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు అన్నారు. ఆమె ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడు తూ గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలి సారిగా రెండు సార్లు అంగన్‌వాడీ వేతనాలు పెంచిన ఘనత టీడీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి దక్కుతుందన్నారు. గ్రాడ్యుటీ చెల్లింపుల కోసం 2025 బడ్జెట్‌లోనే రూ.20కోట్లు కేటాయించారని ఆమె తెలిపారు.

‘హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది’

పూసపాటిరేగ, మార్చి 1 అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరుఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. ఆదివారం వెంపడాం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూలేని విధంగా టీడీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలకు రెండుసార్లు వేతనాలు పెంచిదన్నారు. ఎన్నికల్లో అంగన్‌వాడీలకు ఇచ్చిన ప్రతిహామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల నాయకులు పిన్నింటి సన్యాశినాయుడు, పిన్నింటి శ్రీనివాసరావు, దంగా భూలోక పాల్గొన్నారు.

# సినిమా



## ‘స్పిరిట్’లో డాన్ లీ ఉన్నాడా? లేడా?

ఒకవైపు సినిమా అప్డేట్స్ వస్తున్నా, మరోవైపు ఒక విదేశీ నటుడి గురించి సాగుతున్న ప్రచారం ఇప్పుడు చిత్ర బృందానికి తలనొప్పిగా మారింది. ఆయన ఒక గ్లోబల్ స్టార్.. బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలుపెడితే అది ఎక్కడ ఆగుతుందో ఎవరికీ తెలియదు. ఆయనతో ఒక సెన్సేషనల్ డైరెక్టర్ జతకడితే ఆ సినిమా రేంజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ‘స్పిరిట్’ మొదలైనప్పటి నుండి ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఒక విదేశీ నటుడి పేరు విపరీతంగా వినిపిస్తోంది. కొరియన్ యాక్షన్ స్టార్ ఆ సినిమాలో ఉన్నాడని, ప్రభాస్ తో ఫైట్ చేయబోతున్నాడని లీకులు చక్కర్లు కొట్టాయి. అయితే తాజాగా విడుదలైన ఒక అప్డేట్ చూసిన తర్వాత అభిమానులు కొంత నిరాశకు లోనవుతున్నారు.వివేక్ ఒబెరాయ్ లుక్..

ఇటీవలే చిత్ర బృందం వివేక్ ఒబెరాయ్ లుక్ విడుదల చేసింది. సాధారణంగా ఇదొక క్రేజీ న్యూస్ అవ్వాలి, కానీ ప్రభాస్ అభిమానులు మాత్రం ‘జస్ట్ ఓకే’ అనేశారు. దీనికి ప్రధాన కారణం.. వారు ఆశించింది కొరియన్ నటుడు డాన్ లీని. గతంలో ‘యానిమల్’ కోసం బాబీ డియోల్ లాంటి సర్ప్రైజ్ విలన్ ని తీసుకొచ్చి షాక్ ఇచ్చిన సందీప్ వంగా, ఈసారి కూడా అలాంటి ప్రయోగమే చేస్తారని అందరూ భావించారు. వివేక్ మనకు కొత్త కాదు, ఇప్పటికే ‘రక్త చరిత్ర’, ‘వినయ విధేయ రామ’ సినిమాల్లో ఆయన విలనిజాన్ని చూసేశాం. అందుకే ఆయన ఎంట్రీ అంతగా సెన్సేషన్ కాలేకపోయింది.

సినిమా మొదలుకాక ముందు నుంచే డాన్ లీ ఈ ప్రాజెక్టులో ఉన్నాడనే వార్త విపరీతంగా ప్రచారంలో ఉంది. దీనిపై సందీప్ రెడ్డి వంగాను ఇంటర్వ్యూలలో అడిగినా ఆయన స్మార్ట్ గా తప్పించుకున్నాడు. ఒకవేళ డాన్ లీ లేకపోయినా అదేదో ముందుగా క్లారిటీ ఇస్తేనే సినిమాకు మంచిదని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా అంతా ఒక విదేశీ నటుడి కోసం ఎదురుచూడటం వల్ల, సినిమాలోని ఇతర ముఖ్యాంశాలు మరుగునపడిపోయే ప్రమాదం ఉంది. ఈ పుకార్లకు త్వరగా చెక్ పెడితేనే ‘స్పిరిట్’ పక్కాగా హైలైట్ అవుతుంది.ప్రభాస్ బిజీ షెడ్యూల్..

మరోవైపు ప్రభాస్ ప్రస్తుతం ‘ఫౌజీ’ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత ‘కల్కి 2’ సెట్స్‌లోకి అడుగు పెట్టాలి. సాధారణంగా ఒక సినిమా చేస్తున్నప్పుడు వేరే ప్రాజెక్టుల జోలికి వెళ్లకూడదని ప్రభాస్ భావిస్తారు, కానీ డెడ్ లైన్స్, బిజీ షెడ్యూల్స్ వల్ల ఆయన తప్పనిసరి పరిస్థితుల్లో పలు సినిమాలను బ్యాలెన్స్ చేయాల్సి వస్తోంది. ‘స్పిరిట్’ షూటింగ్ సమయానికి ఆయన పూర్తి డేట్స్ ఇవ్వగలుగుతారా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సందీప్ రెడ్డి వంగా మార్కు యాక్షన్ కు ప్రభాస్ తోడైతే బాక్సాఫీస్ బద్దలవ్వడం ఖాయం. కానీ అభిమానులు ఆశించినట్లుగా డాన్ లీ ఇందులో కనిపిస్తాడా లేక వివేక్ ఒబెరాయ్ తోనే సరిపెట్టుకోవాలా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.





## కడుపు ఉబ్బరమా..? ఏసీడీటీనా..?

తరచుగా కడుపు ఉబ్బరం అనేది కేవలం అధికంగా తినడం లేదా అసిడిటీకి సంకేతంగా భావించి విస్మరిస్తారు. ఒక మాత్ర తీసుకుంటే సమస్య ముగుస్తుందని భావిస్తారు. కానీ మీరు దాదాపు ప్రతిరోజూ మీ కడుపులో బిగుతుగా అనిపిస్తే, సాయంత్రానికి కల్లా మీ బట్టలు బిగుతుగా అనిపిస్తే, లేదా కొన్ని ఆహార పదార్థాలు తీసుకోవడం తర్వాత మీరు కడుపు నిండినట్లు అనిపిస్తే, పరిస్థితి చాలా సులభం కావచ్చు. పేగులు తరచుగా నెమ్మదిగా సంకేతాలను పంపుతాయని అర్థం. తరచుగా ఉబ్బరంగా ఉండే ఏం చేయాలో తెలుసుకుందాం.

ఏసిడిటీ వల్ల గుండెల్లో మంట, పుల్లని త్రేనుపు లేదా పొత్తికడుపు పైభాగంలో మంట వస్తుంది. మరోవైపు, ఉబ్బరం అనేది పొత్తికడుపు ఒత్తిడి, బరువు లేదా ఉబ్బరం అనుభూతి ద్వారా వస్తుంది. రెండూ ఒకేసారి సంభవించవచ్చు, ఇది గందరగోళంగా ఉంటుంది. గ్యాస్, నెమ్మదిగా ప్రేగు కదలికలు, ఆహార అసహనం, హార్మోన్ల మార్పులు లేదా థైరాయిడ్ రుగ్మతలు కూడా అదనపు ఏసిడీటీ లేకుండా ఉబ్బరానికి కారణమవుతాయి. తరచుగా ఉబ్బరం రావడాన్ని తేలికగా తీసుకోకూడదంటున్నారు వైద్య నిపుణులు. ఇది ప్రకోప ప్రేగు సిండ్రోమ్, జీవక్రియ రుగ్మత, హార్మోన్ల అసమతుల్యతకు సంకేతం కావచ్చంటున్నారు.

పండుగలు, విందులు, శీతల పానీయాలు అతిగా తీసుకోవడం తర్వాత అప్పుడప్పుడు ఉబ్బరం రావడం సహజం. ఇది రోజువారీ అలవాటుగా మారినప్పుడు లేదా వారాల తరబడి కొనసాగినప్పుడు ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా పట్టణ జీవన జీవనశైలి, ఒత్తిడి, తగ్గిన శారీరక శ్రమ కారణంగా క్రియాత్మక జీర్ణశయాంతర సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి స్కాన్‌లలో కనిపించకపోవచ్చు, కానీ అవి ఇప్పటికీ జీవన నాణ్యతను ప్రభావితం చేస్తాయి. రోజువారీ ఉబ్బరం, భోజనం తర్వాత తీవ్రం కావడం, కడుపు నొప్పి, మలబద్ధకం లేదా విరేచనాలు, త్వరగా కడుపు నిండినట్లు అనిపించడం, అలసట, బరువు తగ్గడం లేదా జ్వరం వంటి కొన్ని లక్షణాలు ప్రత్యేక శ్రద్ధ అవసరమంటున్నారు డాక్టర్లు. మూడు నెలలకు పైగా కొనసాగే జీర్ణ లక్షణాలను స్వీయ చికిత్స కంటే వైద్యులను సంప్రదించడం ముఖ్యం. హార్మోన్లు, థైరాయిడ్ కూడా కీలక పాత్ర పోషిస్తాయి. తక్కువ థైరాయిడ్ స్థాయిలు ప్రేగు కదలికలను నెమ్మదిస్తాయి. హార్మోన్ల మార్పుల కారణంగా ఋతుస్రావం లేదా పెరిమెనోపాజ్ సమయంలో నీరు చేరుకోవడం, పెరిగిన వాయువు కారణం కావచ్చంటున్నారు. ఒత్తిడి పేగు బాక్టీరియా, కదలికను కూడా ప్రభావితం చేస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

యాంటాసిడ్‌లు తక్షణ ఉపశమనాన్ని అందిస్తాయి, కానీ పదే పదే వాడటం వల్ల అంతర్లీన సమస్య కప్పివేయంటున్నారు. ఉబ్బరం రెండు నుండి మూడు వారాల కంటే ఎక్కువ కాలం కొనసాగితే.. ఆకలి, నిద్ర, రోజువారీ కార్యకలాపాలను ప్రభావితం చేస్తే, వైద్యుడిని సంప్రదించండి. సాధారణంగా థైరాయిడ్, రక్తహీనత పరీక్షలు, మల పరీక్షలు, అవసరమైతే ఇమేజింగ్ లేదా ఎండోస్కోపీతో సహా రక్త పరీక్షలతో ప్రారంభమవుతాయి. సమతుల్య ఆహారం, ఫైబర్, తగినంత నీరు, క్రమం తప్పకుండా వ్యాయామం, ఒత్తిడి నిర్వహణ తేలికపాటి కేసులలో సహాయపడతాయి. అయితే, శరీరం పదే పదే సంకేతాలను ప్రదర్శిస్తున్నప్పుడు, వాటిని విస్మరించకపోవడమే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



## ఈ మొక్క కనిపిస్తే అస్సలు వదలొద్దు..!

మన ఇంటి చుట్టూ సాధారణంగా పెరిగే కుప్పింటాకు మొక్క, దీనిని ప్రాంతాన్ని బట్టి హరిత మంజరి లేదా మురిపిండి అని కూడా పిలుస్తారు. అపారమైన ఔషధ గుణాలు కలిగిన ఒక అద్భుత వనమూలిక. యూఫోర్బియేసి కుటుంబానికి చెందిన ఈ మొక్క శాస్త్రీయ నామం అకాలిఫా ఇండికా. ఆంగ్లంలో దీనిని ఇండియన్ అకాలిఫా, ఇండియన్ మెర్క్యూరి, ఇండియన్ కాపర్ లీఫ్ లేదా ఇండియన్ నేటిల్ అని కూడా వ్యవహరిస్తారు. దీని ప్రత్యేకత కప్పాకారంలో ఉండే పుష్పగుచ్ఛం. ఈ మొక్కను పూర్వం నుంచి భారతీయ సంప్రదాయ వైద్యంలో, తమిళుల సిద్ధ వైద్యంలో ఉపయోగిస్తున్నారు. అంతేకాకుండా, పశ్చిమ తూర్పు ఆఫ్రికాలో కూడా ఇది ఒక గొప్ప ఔషధిగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆధునిక కాలంలో కూడా వైద్యులు దీనిని వాడమని సిఫార్సు చేయడం కుప్పింటాకు గొప్పతనాన్ని చాటుతుంది.

ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు:

కండరాల నొప్పులు: కుప్పింటాకు తాజా ఆకులను శుభ్రం చేసి రసం తీయాలి. ఈ రసానికి సమానంగా నువ్వుల నూనె కలిపి నీరు ఆవిరి అయ్యే వరకు సన్నటి మంటపై మరిగించి నిల్వ చేసుకోవాలి. కండరాల నొప్పి ఉన్నప్పుడు ఈ నూనెను గోరువెచ్చగా చేసి నొప్పి ఉన్న ప్రదేశంలో రాస్తే ఉపశమనం లభిస్తుంది.

తలనొప్పి: అధిక ఒత్తిడి లేదా ఇతర కారణాల వల్ల వచ్చే తలనొప్పికి, ఈ మొక్క రసాన్ని నుదిటికి రాసి కొంతసేపు విశ్రాంతి తీసుకుంటే తగ్గుతుంది.

చర్మ సౌందర్యం: పూర్వం నుంచి చర్మ సౌందర్యానికి ఈ మొక్కను ఉపయోగించేవారు. ఆకులను మెత్తగా పేస్ట్ చేసి పసుపు కలిపి ముఖానికి అప్లై చేసి పావుగంట తర్వాత చల్లటి నీటితో కడుక్కుంటే ముఖం తెల్లగా, కాంతివంతంగా మారుతుంది. ఇది మొటిమలు, నల్లటి మచ్చలను తగ్గించి, అవాంఛిత రోమాలను కూడా తొలగించడంలో సహాయపడుతుంది. జీర్ణ, శ్వాసకోశ సమస్యలు: విరోచనం సాఫీగా అవ్వడానికి, శ్వాసకోశ సమస్యలు, కఫం తగ్గించడానికి దీని తాజా ఆకులను రాత్రి గ్లాసు నీటిలో వేసి ఉదయం వడకట్టుకుని రెండు స్పూన్ల మోతాదుగా తాగాలి. అధికంగా తీసుకోకూడదు, వాంతులు అయ్యే అవకాశం ఉంది.

## చివర్లో బ్యాట్ ఝుళిపించిన పోవెల్, హోల్డర్

టీ20 ప్రపంచకప్ 2026లో సెమీస్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచులో భారత్‌పై వెస్టిండీస్ భారీ స్కోరు చేసింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ మ్యాచ్ జరుగుతుండగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. ఓ దశలో తక్కువ స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించిన వెస్టిండీస్.. చివర్లో పోవెల్, జేస్ హోల్డర్ బ్యాట్ ఝుళిపించడంతో ఊహించిన దానికంటే ఎక్కువ రన్సే స్కోరు చేసింది. దీంతో భారత్ ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. వెస్టిండీస్‌కు బ్యాటింగ్ అప్పగించాడు. అయితే టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్‌కు ఓపెనర్లు మంచి ఆరంభం అందించారు. షై హోప్ (32), రోస్టన్ ఛేజ్ (36) తొలి వికెట్‌కు 68 పరుగులు జోడించారు. ఈ దశలో వరుణ్ చక్రవర్తి.. భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇన్ ఫామ్ బ్యాటర్ షిమ్రాన్ హిట్‌మెయర్ క్రీజులో ఉన్నంత సేపు ధాటిగా బ్యాటింగ్ చేశాడు. 12 బంతుల్లో 27 రన్స్ చేసిన తర్వాత అతడిని జస్‌ప్రీత్ బుమ్రా ఔట్ చేశాడు.

బుమ్రా ఒకే ఓవర్‌లో హిట్‌మెయర్, రోస్టన్ ఛేజ్‌ను ఔట్ చేసి.. భారత్‌ను పోటీలోకి తెచ్చాడు. ఆ తర్వాత హార్దిక్ పాండ్యా కూడా వికెట్ తీయడంతో 15 ఓవర్లు ముగిసే సరికి వెస్టిండీస్.. 125/5తో నిలిచింది. దీంతో తక్కువ స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించింది. కానీ ఆ తర్వాత వెస్టిండీస్ బ్యాటర్లు గేర్ మార్చారు. అర్షదీప్ వేసిన తర్వాతి ఓవర్లో ఏకంగా 24 పరుగులు రాబట్టారు. వరుణ్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో 14 పరుగులు వచ్చాయి.

ఇక చివరకు వెస్టిండీస్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. రోవ్‌మన్ పావెల్ (34), జేసన్ హోల్డర్ (37) కలిసి ఐదో వికెట్‌కు 35 బంతుల్లో 76 పరుగులు జోడించారు. భారత బౌలర్లలో బుమ్రా రెండు వికెట్లు తీగా. హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి ఒక్కో వికెట్ పడగొట్టారు.



## వెస్టిండీస్‌ను ఓడించలేకపోతే ఐపీఎల్ కాంట్రాక్టులు ఇవ్వొద్దు:

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ ఆదివారం వెస్టిండీస్‌తో వర్చువల్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతోంది. ఇది సూపర్ 8 దశలో భాగమైనప్పటికీ, అసలు ప్రాధాన్యం మాత్రం సెమీఫైనల్ టికెట్‌పైనే నిలిచింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు సెమీఫైనల్‌కు చేరుతుంది. ఓడిన జట్టు టోర్నీ నుంచి బయటపడుతుంది. ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడిన ఇరు జట్లు రెండు పాయింట్లతో సమానంగా ఉన్నాయి. జింబాబ్వేపై భారీ విజయాలు సాధించినప్పటికీ, దక్షిణాఫ్రికాతో ఓటమి చవిచూశాయి.

మనోజ్ తివారీ సంచలన వ్యాఖ్యలు..

మాజీ భారత బ్యాటర్ మనోజ్ తివారీ సరదాగా కానీ కీలక వ్యాఖ్యలు చేశాడు. “భారత్ గత మ్యాచ్‌లో 256 పరుగులు చేసింది. ఆ స్థాయి నుంచి చూస్తే, వెస్టిండీస్‌పై ఎలాంటి ఒత్తిడి లేకుండా 200కి పైగా స్కోర్ చేసి సులభంగా గెలవాలి. వెస్టిండీస్‌ను ఓడించలేకపోతే, ఎవరికీ ఖూా కాంట్రాక్టులు ఇవ్వొద్దు” అని క్రిక్‌బజ్ చర్చలో తివారీ తెలిపాడు.

దక్షిణాఫ్రికాతో మొదటి సూపర్ 8 మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో ఓడిన భారత్, జింబాబ్వేపై 256/4 భారీ స్కోర్ చేసి 72 పరుగుల తేడాతో గెలిచి బలంగా తిరిగి వచ్చింది.

వీరేంద్ర సెహ్వాగ్ భిన్నాభిప్రాయం..

అదే చర్చలో పాల్గొన్న మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ మాత్రం తివారీ అభిప్రాయానికి భిన్నంగా స్పందించాడు. “మనం అజేయులం కాదు. ఇతర జట్లు కూడా గెలవడానికి వస్తాయి. దక్షిణాఫ్రికాతో ఓ చెడు రోజు ఎదురైంది. జింబాబ్వేను ఓడించాం. ఇప్పుడు వెస్టిండీస్‌ను ఓడిస్తే నవ్వుతూ సెమీఫైనల్‌కు చేరతాం” అని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు. “మన దేశం చాలా భావోద్వేగంగా స్పందిస్తుంది. ఒకే ఓటమి తర్వాత ప్రపంచకప్ పోయినట్లుగా స్పందిస్తారు” అంటూ పేర్కొన్నాడు.

సెమీఫైనల్ సమీకరణ..

దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి భారత్‌కు కష్టాలు తెచ్చినా, దక్షిణాఫ్రికా వెస్టిండీస్‌పై గెలవడంతో పరిస్థితి కొంత సులభమైంది.

ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా ఇప్పటికే సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. చివరి స్థానం కోసం భారత్, వెస్టిండీస్ పోటీ పడుతున్నాయి. ఈ హై వోల్టేజ్ మ్యాచ్‌లో గెలిచే జట్టే చివరి నాలుగులో స్థానం సంపాదిస్తుంది.

సెమీస్ పోరు ఇలా..

తొలి సెమీస్ లో భాగంగా న్యూజిలాండ్ వర్సెస్ సౌతాఫ్రికా జట్లు తపడనున్నాయి. ఇక రెండో మ్యాచ్ లో ఇంగ్లాండ్ జట్టుతో తలపడే జట్టు ఏదో మరికొద్దిసేపట్లో తేలనుంది.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.